# సాక్షి ఆదిలాబాద్

శుక్రవారం । 26 । సెప్టెంబర్ । 2025






**ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి**
ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని రాయిసెంటర్, ఆదివాసీ, తుడుందెబ్బ నాయకులు నినదించారు. తలమడుగులో మహాపాదయాత్ర నిర్వహించారు. 10లో▸



**బతుకమ్మ సంబురాలు**
ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయం, రిమ్స్ ఆస్పత్రిలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. మహిళా ఉద్యోగులు, సిబ్బంది బతుకమ్మ ఆడుతూ సందడి చేశారు. 11లో▸

గరిష్ఠం/కనిష్ఠం
29.0/24.0

**వాతావరణం**
సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడా భారీ వర్షం కురిసే అవకాశముంది.

## న్యూస్‌రీల్

### సౌత్ జోన్ పోటీల్లో సత్తా



కోచ్ రమేశ్‌తో చరణ్

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరాప్రియదర్శిని స్టేడియంలోగల ఆదిలాబాద్ క్రీడా పాఠశాలకు చెందిన విద్యార్థి ఎస్.చరణ్ సౌత్ జోన్ జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటాడు. ఈనెల 23న ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో గల ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ప్రారంభమైన 36వ సౌత్ జోన్ జాతీయ స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ట్రయాథ్లాన్ -ఏ పోటీల్లో గురువారం స్వర్ణంతో మెరిసినట్లు అథ్లెటిక్స్ కోచ్ రమేశ్ తెలిపారు. ఈ సంవత్సరం అథ్లెటిక్స్ పోటీల్లో జాతీయస్థాయిలో విజేతగా నిలిచిన ఆదిలాబాద్ క్రీడా పాఠశాలకు చెందిన తొలి అథ్లెట్ చరణ్ అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చరణ్‌ను డీవైఎస్వో శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

### విధుల్లో చేరిన ఏఎంవీఐలు



డీటీవో శ్రీనివాస్‌తో ఏఎంవీఐలు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాకు ప్రభుత్వం కేటాయించిన ముగ్గురు ఏఎంవీఐలు టీ రంజిత్‌కుమార్, మోతె శ్వేత, శ్రీనిహారిక విధుల్లో చేరారు. జిల్లా రవాణాశాఖ అధికారి సిపెల్లి శ్రీనివాస్‌కు గురువారం రిపోర్ట్ చేశారు. వీరికి రవాణాశాఖ కార్యాలయంలో బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం కార్యాలయంలో ఇద్దరు పనిచేస్తుండగా వీరి నియామకంతో ఈ సంఖ్య ఐదుకు పెరిగింది. కార్యాలయ విధుల నిర్వహణ, రోడ్డు సేఫ్టీ మెరుగుపడనుండగా, రవాణాశాఖ ఆదాయం పెరిగేందుకు తోడ్పడనుంది.

### ఎట్టకేలకు టీచర్ల సర్దుబాటు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో వివిధ పాఠశాలలకు అవసరమైన ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తూ డీఈవో ఖుష్బూ గుప్తా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. దసరా సెలవులకు ముందే సర్దుబాటు ప్రక్రియ పూర్తి చేయగా ఉత్తర్వులు జారీ చేయడంలో ఆలస్యమైంది. మొదటి విడతలో 131మందిని, ప్రస్తుతం 39 మందిని.. మొత్తంగా 160మందిని సర్దుబాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం సర్దుబాటు అయినవారిలో స్కూల్ అసిస్టెంట్ బయో సైన్స్‌లో ఇద్దరు, ఇంగ్లిష్‌లో ఇద్దరు, గణితంలో ఇద్దరు, తెలుగులో ఒకరు, ఫిజికల్ సైన్స్‌లో ఒకరు, సాంఘిక శాస్త్రంలో నలుగురు, ఎస్జీటీ విభాగంలో 26మంది ఉన్నారు.

### నేడు చాకలి ఐలమ్మ జయంతి

కైలాస్‌నగర్: వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని ఈ నెల 26న అధికారికంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాజర్షి షా ఓ ప్రకటనలో తెలిపారు. రిమ్స్ ఆస్పత్రి ఎదుట ఐలమ్మ విగ్రహం వద్ద ఉదయం 10.30గంటలకు నిర్వహించనున్న కార్యక్రమానికి జిల్లాలోని రజక, బీసీ సంఘాల ప్రతినిధులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

**రేపు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి**
ఈ నెల 27న ఉదయం 10.30గంటలకు గాంధీ పార్కు సమీపంలోని బాపూజీ చౌక్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని అధికారికంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాజర్షి షా ఓ ప్రకటనలో తెలిపారు. పద్మశాలీ కులస్తులు, బీసీ సంఘాల ప్రతినిధులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

### సర్వేయర్ ఫలితాలు విడుదల

కైలాస్‌నగర్: లైసెన్స్‌డ్ సర్వేయర్ పరీక్షా ఫలితాలను ప్రభుత్వం విడుదల చేసింది. జిల్లాలో తొలి విడతలో నిర్వహించిన రాత పరీక్షలో ఫెయిలైన 109 మందికి ఇటీవల మరోసారి సప్లిమెంటరీ పరీక్ష నిర్వహించింది. ఇందులో 105 మంది పరీక్ష రాయగా నలుగురు గైర్హాజరయ్యారు. గురువారం ప్రకటించిన ఫలితాల్లో 40మంది ఉత్తీర్ణులు కాగా, 65మంది ఫెయిలయ్యారు. తొలి విడతలో పాసైన నలుగురితో కలిపి 45మంది ఉత్తీర్ణులు కాగా, వీరికి త్వరలో అసెస్‌మెంట్ పరీక్ష నిర్వహిస్తామని జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రాజేందర్ తెలిపారు.

### 'సాత్నాల' నుంచి నీటి విడుదల



ప్రాజెక్ట్ నుంచి దిగువకు వెళ్తున్న నీరు

సాత్నాల: మండలంలోని సాత్నాల ప్రాజెక్ట్‌కు 1,605 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. గురువారం మూడు గేట్లు ఎత్తి 2,380 క్యూసెక్కులను దిగువకు వదిలినట్లు జేఈ దీపక్ తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1.24 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 1.046 టీఎంసీలు ఉన్నట్లు వెల్లడించారు.

# స్త్రీనిధి స్వాహా

- మూడు ఎస్‌హెచ్‌జీల్లో రూ.13లక్షలు కాజేసిన పలువురు వీవోఏలు, సీసీలు
- సోషల్ ఆడిట్‌లో అవినీతి బహిర్గతం
- అక్రమార్కులపై చర్యలకు వెనుకంజ!

| జిల్లా సమాచారం | |
|---|---|
| స్వయం సహాయక సంఘాలు | 10,990 |
| గ్రామైక్య సంఘాలు | 554 |
| సంఘాల్లోని సభ్యులు | 1,48,052 |



జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ కార్యాలయం

కైలాస్‌నగర్: స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీ నిధి పథకంలో స్వాహా పర్వం సాగుతోంది. సభ్యులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించడం, సక్రమంగా చెల్లించేలా చూస్తూ అండగా నిలవాల్సిన ఉద్యోగులే అక్రమాలకు పాల్పడుతున్నారు. అందిన కాడికి స్వాహా చేస్తున్నారు. జిల్లాలో ఇటీవల నిర్వహించిన సోషల్ ఆడిట్‌లో ఈ అవినీతి బాగోతం బయటపడింది. మూడు సంఘాల్లోనే రూ.13లక్షల మేర నిధులు దుర్వినియోగమైనట్లు తేలడం అందులోని అవినీతి, అక్రమాలకు అద్దం పడుతోంది. అక్రమార్కులపై కొరడా ఝులిపించాల్సిన అధికారులు మౌనంగా ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది.

**బ్యాంకుల్లో జమ చేయకుండా..**
ఎస్‌హెచ్‌జీ సభ్యులు ఇంటి వద్దే ఉంటూ కిరాణం, పాడిపశువులు, కోళ్ల పెంపకం, బ్యూటీ పార్లర్, గాజుల షాపులు, పేపర్‌ప్లేట్ల తయారీ, ఇంటర్నెట్ సెంటర్, సెంట్రింగ్, బట్టల షాపులు, జిరాక్స్ సెంటర్ తదితర వ్యాపారాలు నిర్వహిస్తూ వారి కాళ్లపై వారు నిలబడాలనే ఉద్దేశంతో ప్రభుత్వం స్త్రీ నిధిని అమలు చేస్తోంది. అతి తక్కువ వడ్డీకే రూ.50వేల నుంచి రూ.3లక్షల వరకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇస్తోంది. అయితే.. ఈ పథకం అక్రమార్కులకు వరంలా మారింది. ఆయా సంఘాల సభ్యులు చెల్లించిన డబ్బులను బ్యాంకుల్లో జమ చేయకుండా సొంతానికి వాడుకుంటూ దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. ఇందులో వీవోఏలతో పాటు సీసీల పాత్ర ఉండడం విస్మయానికి గురిచేస్తోంది.

**అవినీతి బయటపడింది ఇలా..**
స్త్రీ నిధి రుణాల చెల్లింపులు జిల్లాలో భారీగా పేరుకుపోయాయి. ఇప్పటివరకు రూ.20కోట్లు బ్యాంకులకు కిస్తీల రూపంలో చెల్లించాల్సి ఉంది. ఇంత పెద్ద మొత్తంలో బకాయిలు పేరుకుపోవడాన్ని తీవ్రంగా పరిగణించిన స్త్రీ నిధి రాష్ట్ర ప్రధాన కార్యాలయ అధికారులు జిల్లాలో సోషల్ ఆడిట్ నిర్వహణకు ఆదేశించారు. దీంతో హైదరాబాద్‌కు చెందిన సోషల్ ఆడిట్ సీఆర్‌పీ ఆదిలాబాద్ పట్టణంలోని మూడు, గుడిహత్నూర్‌లోని నాలుగు, ఆదిలాబాద్ రూరల్ మండలంలోని ఒక సంఘం.. మొత్తం ఎనిమిది సంఘాల్లో సోషల్ ఆడిట్ నిర్వహించారు. వీటిలో భారీగా నిధుల దుర్వినియోగం జరిగినట్లు నిర్ధారించారు. ఎస్‌హెచ్‌జీల కార్యకలాపాలను పర్యవేక్షించాల్సిన సీసీలు, వీవోలే నిధులు స్వాహా చేసినట్లు తేల్చారు. మూడు సంఘాల్లోనే రూ.13,69,528 దుర్వినియోగమైనట్లు నిర్ధారిస్తూ ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు.

### ఈ సంఘాల్లోనే దుర్వినియోగం

- గుడిహత్నూర్ మండలంలోని రామారావు మహరాజ్ గ్రామ సమాఖ్య సంఘంలో వీవోగా పనిచేసిన దినేశ్ రూ.6,33,528 నిధులు దుర్వినియోగం చేసినట్లు ఆడిట్‌లో వెల్లడైంది. మూడేళ్లుగా వీటిని చెల్లించకపోవడంతో ఈ మొత్తానికి రూ.1,92,000 వడ్డీ జమ చేశారు. దీంతో సదరు వీవోఏ రూ.8,25,528 చెల్లించాల్సి ఉండగా ఒక్కపైసా రికవరీ చేయకపోవడంతో స్వాహా పర్వంలో సీసీ భాగస్వామ్యముందనే ఆరోపణలున్నాయి. మూడు నెలల్లోపు చెల్లిస్తామని వీవోఏ, సీసీ లిఖితపూర్వకంగా రాసి ఇచ్చినప్పటికీ నయాపైసా చెల్లించలేదు. ప్రస్తుతం వీవోఏ విధులు మానేయడంతో రికవరీ ప్రశ్నార్థకంగా మారింది.
- గుడిహత్నూర్ మండలంలోని మహాలక్ష్మి గ్రామైక్య సంఘంలో వీవోఏగా పనిచేసిన సదానందం రూ.2.36లక్షలు స్వాహా చేసినట్లు ఆడిట్‌లో తేలింది. వీటిని చెల్లించకపోవడంతో రూ.50వేల వడ్డీ జమ చేశారు. దీంతో పాటు తన భార్య పేరిట మరో రూ.1.40 లక్షల రుణం తీసుకున్నారు. ఈ మొత్తాన్ని సొంతానికి వాడుకున్న సదరు వీవోఏ ఆ తర్వాత విధుల నుంచి తప్పుకొన్నారు. అధికారులు ఈ మొత్తాన్ని రికవరీ చేయకపోవడాన్ని బట్టి చూస్తే సీసీకి కూడా స్వాహాలో భాగస్వామ్యమున్నట్లు స్పష్టమవుతోంది.
- ఆదిలాబాద్ రూరల్ మండలం తంతోలి గ్రామంలోని జైయోగేశ్వర గ్రామైక్య సంఘంలో ఆడిట్ నిర్వహించిన అధికారులు రూ.5లక్షలు దుర్వినియోగమైనట్లు నిర్ధారించారు. ఈ నిధులను సంఘం అధ్యక్షురాలు తన సొంతానికి వాడుకున్నట్లు తేల్చారు.

### ఉన్నతాధికారులకు నివేదించాం

జిల్లాలోని ఎనిమిది ఎస్‌హెచ్‌జీల్లో సోషల్ ఆడిట్ నిర్వహించగా మూడింటిలో నిధుల దుర్వినియోగం జరిగినట్లు అధికారులు నిర్ధారించారు. నిధులు స్వాహా చేసిన అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు నివేదించాం. అన్ని సంఘాల్లోనూ ఆడిట్ చేయించాలని కోరాం. స్వాహాకు పాల్పడినవారిపై పోలీసు కేసు నమోదు చేసేలా చూస్తాం.

– పూర్ణచందర్,
స్త్రీ నిధి రీజినల్ మేనేజర్, ఆదిలాబాద్

# టెండర్ల జాతర!

- వైన్స్‌ల అప్లికేషన్ ఫీజు పెంపు
- గతం కంటే రూ.లక్ష అదనం
- ఆశావహులపై పెరిగిన భారం
- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ
- ఉమ్మడి జిల్లాలో రీలొకేషన్‌కు ఆరు

| ఎక్సైజ్ షెడ్యూల్ ఇలా.. | |
|---|---|
| టెండర్ నోటిఫికేషన్ | 26న (నేడు) |
| దరఖాస్తు స్వీకరణ | నేటి నుంచి ప్రారంభం |
| దరఖాస్తు గడువు | అక్టోబర్ 18 |
| డ్రా నిర్వహణ | అక్టోబర్ 23న |
| షాపులు ప్రారంభం | డిసెంబర్ 1నుంచి |

గత పాలసీలో అప్లికేషన్ల ఆదాయం (రూ.కోట్లలో)

| జిల్లా | షాపులు | దరఖాస్తులు | ఆదాయం |
|---|---|---|---|
| ఆదిలాబాద్ | 40 | 1,047 | 20.94 |
| ఆసిఫాబాద్ | 32 | 1,020 | 20.40 |
| మంచిర్యాల | 73 | 2,242 | 44.84 |
| నిర్మల్ | 47 | 1,067 | 21.34 |
| మొత్తం | 192 | 5,376 | 107.52 |

సాక్షి, ఆదిలాబాద్: కొత్త మద్యం పాలసీ (2025–2027)లో భాగంగా జిల్లాలో శుక్రవారం నుంచి టెండర్ల జాతర ప్రారంభం కానుంది. గత ఎక్సైజ్ పాలసీ (2023–25)లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో దరఖాస్తు ఫీజు ద్వారా ప్రభుత్వానికి రూ.107.52 కోట్ల ఆదాయం వచ్చింది. గత పాలసీలో దరఖాస్తు ఫీజు రూ.2లక్షలు కాగా, నూతన పాలసీలో రూ.లక్ష అదనంగా పెంచి రూ.3లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించింది. శుక్రవారం టెండర్ నోటిఫికేషన్ జారీ కానుండగా ఈరోజు నుంచే దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలు కానుంది. అప్లికేషన్ కోసం ముందుగా ఫీజు చెల్లించాల్సి ఉండగా, ఆశావహులకు ఇది భారంగా మారింది.

**రిజర్వేషన్ కోటా కేటాయింపు**
ఎక్సైజ్ టెండర్ నోటిఫికేషన్ కంటే ముందు గౌడ, ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీలకు రిజర్వేషన్ కోటా ప్రకారం షాపులు కేటాయించారు. గురువారం ఆయా కలెక్టర్ల సమక్షంలో డీపీఈవోలు, ఇతర అధికారులు ప్రక్రియ పూర్తి చేశారు. షెడ్యూల్డ్ ఏరియాలోని షాపులన్నీ పేసా యాక్ట్ ప్రకారం ఎస్టీలే దరఖాస్తు చేసుకునేందుకు గతంలోలాగే అవకాశం కల్పించారు. షెడ్యూల్డ్ ఏరియా పరిధిలోకి రాని మండలాల్లోనూ కొన్ని గ్రామాలు షెడ్యూల్డ్ ఏరియా పరిధిలోకి వస్తాయి. అలాంటి చోట ఈ రిజర్వేషన్ కోటా అమలు చేసి కేటాయింపులు చేశారు.



లాటరీ టోకెన్ చూపిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

**ఆరింటికి రీలొకేషన్**
గత ఎక్సైజ్ పాలసీలో ఆదాయం రాని వైన్స్‌లను మరోచోటకు తరలించారు. ఉమ్మడి జిల్లాలో ఇలా ఆరు షాపులు మరోచోటకు రీలొకేషన్ చేశారు. ఆదిలాబాద్ జిల్లాలో గుడిహత్నూర్ మండలంలోని మన్నూర్ వైన్స్‌ను అదే మండలంలోని మచ్చాపూర్ గ్రామానికి తరలించారు. ఇంద్రవెల్లి మండలంలోని ముత్నూర్ వైన్స్‌ను అదే మండలంలోని ఈశ్వర్‌నగర్‌కు, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో సిర్పూర్ (టీ) మండలంలోని లోనవెల్లి గ్రామంలోని వైన్స్‌ను చింతలమానెపల్లికి, సిర్పూర్(యూ) మండలంలోని రాగాపూర్ షాపును సిర్పూర్ (యూ)కు, లింగాపూర్ షాపును జైనూర్‌కు, నిర్మల్ జిల్లాలో లక్ష్మణచాంద మండలంలోని వైన్స్‌ను సోన్‌కు మార్చారు. నూతన ఎక్సైజ్ పాలసీలో ఈ రీలొకేషన్ ఆధారంగా ఆయా షాపులకు నంబర్లు కేటాయించారు.

**వైన్‌షాపుల రిజర్వేషన్లు ఖరారు**
కైలాస్‌నగర్: జిల్లాలోని 40మద్యం దుకాణాలను రిజర్వేషన్ల వారీగా కేటాయించేందుకు గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ రాజర్షి షా ఆధ్వర్యంలో లాటరీ ప్రక్రియ నిర్వహించారు. కులాల వారీగా షాపులు కేటాయించారు. గౌడ కులస్తులకు ఒకటి, ఎస్టీలకు ఐదు, ఎస్సీలకు 10 షాపులను ప్రభుత్వ నిబంధనల మేరకు కేటాయించారు. మరో 24 షాపులను అన్ రిజర్వ్‌డ్ జనరల్‌గా కేటాయించారు. ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేలా వీడియో చిత్రీకరణ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ అధికారి హిమశ్రీ, ఎస్సీ, బీసీ సంక్షేమ శాఖల జిల్లా అధికారులు సునీతాకుమారి, రాజలింగు, ఏటీడీవో నిహారిక, ఎక్సైజ్ సీఐ విజేందర్, ఎస్సై అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ



ఎక్సైజ్ నూతన పాలసీలో భాగంగా శుక్రవారం నుంచి డీపీఈవో కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరణ ప్రారంభమవుతుంది. దరఖాస్తు ఫీజు రూ.3లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించింది. టెండర్ నోటిఫికేషన్‌లో పూర్తి వివరాలు ప్రకటిస్తుంది.

– హిమశ్రీ, డీపీఈవో, ఆదిలాబాద్

# అసాంఘిక చర్యలకు పాల్పడవద్దు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్‌మహాజన్



స్వాధీనం చేసుకున్న పత్రాలు లేని వాహనాలు

- ఎస్పీ అఖిల్ మహాజన్
- కేశవపట్నంలో కార్డన్ సెర్చ్
- పలు వాహనాలు స్వాధీనం

ఇచ్చోడ: అసాంఘిక చర్యలకు పాల్పడవద్దని ఎస్పీ అఖిల్‌మహాజన్ సూచించారు. గురువారం ఉదయం 5గంటలకు మండలంలోని కేశవపట్నంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించగా ఎస్పీ భారీ వర్షంలోనూ గ్రామాన్ని సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. గత ఐదేళ్లలో గ్రామానికి చెందిన పలువురిపై 90 కేసులు నమోదైనట్లు తెలిపారు. కలప స్మగ్లింగ్, పీడీ యాక్ట్, రౌడీ షీట్‌లు నమోదైన వారు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండి సత్ప్రవర్తనతో మెదిలితే కేసులు ఎత్తివేసే దిశగా కృషి చేస్తామని తెలిపారు. చదువుకోలేక కొన్నేళ్లుగా ఇక్కడి ముల్తానీలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, ఐదేళ్లున్న పిల్లలందరినీ పాఠశాలలకు పంపించాలని పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని పోలీస్‌శాఖకు సహకరించాలని కోరారు.

**పత్రాలు లేని వాహనాలు స్వాధీనం**
కేశవపట్నం గ్రామంలో నిర్వహించిన కార్డన్ సెర్చ్‌లో భాగంగా పోలీసులు ఇంటింటా తనిఖీలు నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలులేని 82 ద్విచక్ర వాహనాలు, 18 ఆటోలు, ఒక మ్యాక్స్ వాహనం స్వాధీనం చేసుకున్నారు. ఉట్నూర్ అడిషనల్ ఎస్పీ కాజల్‌సింగ్, ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాస్, ఇచ్చోడ, ఉట్నూర్ సీఐలు రాజు, ప్రసాద్, ఇచ్చోడ, ఇంద్రవెల్లి, గుడిహత్నూర్, నేరడిగొండ, సిరికొండ ఎస్సైలు పురుషోత్తం, సాయన్న, శ్రీకాంత్, ఇమ్రాన్, పూజ, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై అన్వర్ ఉల్ హక్, 180మంది పోలీసులు, 20 మంది మహిళా పోలీసులు పాల్గొన్నారు.

# సజావుగా ఇంటర్వ్యూల ప్రక్రియ



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: ప్రభుత్వ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్య (ప్రీ ప్రైమరీ స్కూల్స్)ను అందించేందుకు ప్రభుత్వం 19 ఇన్‌స్ట్రక్టర్, 19 ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరించింది. జిల్లా వ్యాప్తంగా 38 పోస్టులకు 735మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. వీరి ఎంపిక కోసం గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ రాజర్షి షా ఆధ్వర్యంలో ఒక్కో పోస్టుకు ఇద్దరు అభ్యర్థులను పిలిచి ఇంటర్వ్యూ నిర్వహించారు. ఈ ప్రక్రియ సజావుగా సాగింది. కాగా, పోటీ తీవ్రంగా ఉండటంతో డీఎడ్ అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించినట్లు అధికారులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల జాబితా త్వరలో ప్రకటిస్తామన్నారు. అడిషనల్ కలెక్టర్ రాజేశ్వర్, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# హెపటైటిస్‌ను గుర్తించకుంటే ప్రాణాంతకమే

ఆదిలాబాద్‌టౌన్: హెపటైటిస్‌ను సకాలంలో గుర్తించకుంటే ప్రాణాంతకమవుతుందని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ పేర్కొన్నారు. జాతీయ హెపటైటిస్ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా గురువారం రిమ్స్ ఆడిటోరియంలో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది, మెడికోలకు వ్యాక్సిన్ వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హెపటైటిస్ కాలేయంపై ప్రభావం చూపుతుందని తెలిపారు. నిర్లక్ష్యం చేస్తే కామెర్లకు దారితీస్తుందని పేర్కొన్నారు. ఆకలి మందగించడం, వికారం, అలసట, మూత్రం ముదురురంగులో ఉండడం లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. రిమ్స్ ఆస్పత్రిలో 400 డోసుల వ్యాక్సిన్ అందుబాటులో ఉందని తెలిపారు. ముందుజాగ్రత్తగా ప్రతి ఒక్కరూ దీనిని వినియోగించుకోవాలని సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, డీఐఈవో వైసీ శ్రీనివాస్, ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి శ్రీకాంత్, రిమ్స్ వైద్యులు తిప్పేస్వామి, తానాజీ, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

# కల సాకారమైన వేళ

- గ్రూప్‌–1లో మెరిసిన జిల్లావాసులు
- పట్టుదలతో లక్ష్యం చేరిన యువత

ఆశయ సాధనకు ఎన్ని ఇబ్బందులొచ్చినా వెన్ను చూపలేదు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా పట్టు వీడలేదు. ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నా ఇష్టపడి చదివారు. పగలు, రాత్రి పుస్తకాలతో కుస్తీ పట్టారు. చివరికి అనుకున్న లక్ష్యం సాధించారు. జిల్లాకు చెందిన పలువురు అత్యుత్తమ ర్యాంకులతో గ్రూప్‌–1 ఉద్యోగాలు సాధించారు.



### ఫైర్‌మన్ నుంచి గ్రూప్‌–1 అధికారిగా..



శశిధర్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: భోరజ్ మండలం పిప్పర్‌వాడకు చెందిన రాజీవ్‌రెడ్డి–లక్ష్మి దంపతుల కుమారుడు శశిధర్‌రెడ్డి చిన్నప్పటి నుంచి కష్టపడి చదివి వివిధ ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. ప్రస్తుతం గ్రూప్‌–1లో అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించాడు. శశిధర్‌రెడ్డి జిల్లా కేంద్రంలోని ఫైర్‌స్టేషన్‌లో ఫైర్‌మన్ (కానిస్టేబుల్)గా విధులు నిర్వహిస్తున్నాడు. 2017లో ఈ ఉద్యోగం సాధించాడు. ఆ తర్వాత 2018లో ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా, గ్రూప్‌–4లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగాలు సాధించినా ఫైర్‌మన్‌గానే కొనసాగుతున్నాడు. దీంతో ఆయన నాలుగు ఉద్యోగాలు సాధించాడు. శశిధర్‌రెడ్డికి భార్య పల్లవి, ఇద్దరు పిల్లలు మనస్వి, శ్రీహన్ష్ ఉన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీరాంరెడ్డి పాఠశాలలో పదో తరగతి, బోథ్‌లో ఇంటర్, హైదరాబాద్‌లో డిగ్రీ పూర్తి చేశాడు.

### ఉపాధ్యాయుడి కొడుకు ఎంపీడీవోగా..



ఉయికే శ్రీనివాస్

ఇచ్చోడ: మండల కేంద్రంలోని విద్యానగర్ కాలనీకి చెందిన ఉయికే శ్రీనివాస్ గ్రూప్‌–1లో సత్తా చాటి ఎంపీడీవో ఉద్యోగం సాధించాడు. శ్రీనివాస్ తండ్రి సంజీవ్ నాగేశ్వర్‌రావు ఐటీడీఏలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. శ్రీనివాస్ ప్రాథమిక విద్యను మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో, ఇంటర్, డిగ్రీ హైదరాబాద్‌లో పూర్తి చేశాడు.

### నందినికి ఇది నాలుగో కొలువు



నందిని

ఆదిలాబాద్ టౌన్: జిల్లా కేంద్రంలోని తిర్పెల్లి కాలనీకి చెందిన జనగం సంతోష్–సంగీత దంపతుల ఏకైక సంతానమైన నందిని వైద్యారోగ్యశాఖలో ఏవోగా ఉద్యోగం సాధించింది. పదోతరగతి వరకు జిల్లా కేంద్రంలోని లిటిల్‌స్టార్, ఇంటర్ నుంచి డిగ్రీ వరకు హైదరాబాద్‌లోని నారాయణ ఐఏఎస్ అకాడమీలో అభ్యసించింది. ఉస్మానియా కళాశాలలో పీజీ పూర్తి చేసింది. ఇదివరకు మున్సిపల్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికై ఆదిలాబాద్ మున్సిపాలిటీలో మూడు నెలల పాటు పనిచేసింది. గ్రూప్‌–3 ఉద్యోగానికి ఎంపికైనా పోస్టింగ్ ఇవ్వలేదు. ఇటీవల ఆమె జేఎల్ కొలువు సాధించి నిర్మల్ ప్రభుత్వ కళాశాలలో జూనియర్ లెక్చరర్‌గా పనిచేస్తోంది. ఉద్యోగం చేస్తూనే ఎలాంటి కోచింగ్ లేకుండా పరీక్షకు హాజరైన ఆమె తాజాగా గ్రూప్‌–1లో ఉద్యోగం సాధించింది.

### మొదటి ప్రయత్నంలోనే డీఎస్పీగా..



రాథోడ్ ప్రమోద్

ఇంద్రవెల్లి: మండలంలోని వాగాయితండాకు చెందిన సత్యభామ–రాథోడ్ దుదిరాం దంపతుల కుమారుడైన రాథోడ్ ప్రమోద్ గ్రూప్‌–1లో 458.5 మార్కులతో 420వ ర్యాంక్ సాధించి డీఎస్పీ ఉద్యోగం దక్కించుకున్నాడు. ప్రమోద్ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఒకటి నుంచి ఇంటర్ వరకు చదివాడు. 2007–10 విద్యాసంవత్సరంలో ఢిల్లీలోని వెంకటేశ్వర యూనివర్సిటీలో డిగ్రీలో బీఏ పూర్తి చేశాడు. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఏ పూర్తి చేసి అక్కడే ప్రస్తుతం పీహెచ్‌డీ మూడో సంవత్సరం చదువుతూ గ్రూప్స్‌కు సిద్ధమయ్యాడు. మొదటి ప్రయత్నంలోనే సత్తా చాటి డీఎస్పీగా ఉద్యోగం సాధించాడు. కాగా, ప్రమోద్ ఐదుసార్లు యూపీఎస్సీ సివిల్స్ రాసి ఇంటర్వ్యూ వరకు వెళ్లడం గమనార్హం.

### పంచాయతీ కార్యదర్శి నుంచి ఎంపీడీవోగా..



లవకుమార్

ఉట్నూర్‌రూరల్: మండలంలోని కొత్తగూడ చెక్ పోస్టు గ్రామానికి చెందిన తుడుం లవ్‌కుమార్ గ్రూప్‌–1లో రాణించి ఎంపీడీవోగా ఉద్యోగం సాధించాడు. ఆదిలాబాద్‌లోని గిరిజన గురుకుల పాఠశాలలో పదో తరగతి వరకు, డీఆర్‌డీఏ ద్వారా హైదరాబాద్‌లోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ చదివాడు. బీటెక్‌లో 70 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాడు. 2016లో గ్రూప్‌–2లో విఫలమై, 2019లో పంచాయతీ కార్యదర్శిగా ఎంపికయ్యాడు. ప్రస్తుతం నార్నూర్ మండలం మాన్కాపూర్ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఉద్యోగం చేస్తూనే 2022 నుంచి గ్రూప్‌–1 కోసం ప్రయత్నించాడు. 440 మార్కులతో (తెలుగు మీడియం) స్టేట్ 902, ఎస్సీ కేటగిరీలో 88వ ర్యాంక్ సాధించి ఎంపీడీవో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. కాగా, లవకుమార్ పదేళ్ల వయస్సులోనే తల్లిదండ్రులు మరణించారు. భార్య మృణాళిని, మిత్రులు ప్రవీణ్, వెంకటేశ్, రాజు, అన్నయ్య రాజేందర్ ప్రోత్సాహంతో తాను ఈ విజయం సాధించినట్లు లవకుమార్ తెలిపాడు.

### స్వతహాగా సన్నద్ధమై డీఎస్పీగా ఎంపికై..



సాక్షి మకారియా

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రానికి చెందిన సునీల్‌కుమార్ మకారియా–శ్వేత మకారియా దంపతుల కుమార్తె సాక్షి మకారియా గ్రూప్‌–1లో డీఎస్పీ ఉద్యోగం సాధించింది. జిల్లా కేంద్రంలోని కాన్వెంట్ పాఠశాలలో పదో తరగతి, హైదరాబాద్ చైతన్యలో ఇంటర్, ఢిల్లీలోని ఎల్ఎస్ఆర్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసింది. ఢిల్లీలోనే ఉంటూ పీజీ, బీఏ, ఎంఏ చదివింది. సివిల్స్ సాధించేందుకు తీవ్రంగా శ్రమించింది. ఐదుసార్లు యూపీఎస్సీ పరీక్షలు రాసినా విజయం సాధించలేకపోయింది. ఆ తర్వాత హైదరాబాద్‌లో ఉంటూ పరీక్షల కోసం సన్నద్ధమైంది. ఎలాంటి కోచింగ్ తీసుకోకుండానే స్వతహాగా సన్నద్ధమై గ్రూప్‌–1లో సత్తా చాటింది. 65వ ర్యాంక్ సాధించి డీఎస్పీగా ఎంపికైంది.

### సామాన్యుడి అసమాన్య ప్రతిభ



సాయికమల్

బోథ్: మండల కేంద్రానికి చెందిన కరిపె మల్లేశ్–రేవతి దంపతుల కుమారుడు సాయికమల్ గ్రూప్‌–1లో ప్రతిభ కనబరిచి డీఎస్పీ పోస్టుకు ఎంపికయ్యాడు. బీటెక్ పూర్తి చేసిన సాయికమల్ 2018లో మిషన్ భగీరథలో ఏఈఈగా ఉద్యోగం సాధించాడు. ఉద్యోగం చేస్తూనే కష్టపడి గ్రూప్‌–1 పరీక్షలకు సన్నద్ధమయ్యాడు. తాజాగా విడుదలైన ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 113వ, మల్టీజోన్‌లో 63వ ర్యాంక్ సాధించి డీఎస్పీగా ఎంపికయ్యాడు. ఈ విజయం వెనుక తల్లిదండ్రుల త్యాగం ఉందని సాయికమల్ తెలిపాడు.

## క్లుప్తంగా

### మద్యం బాటిళ్లు ధ్వంసం



ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్, పోలీస్ అధికారులు

బోథ్: గతంలో కౌఠ, ధన్నూర్, మర్లపెల్లి గ్రామాల్లో పట్టుబడిన మద్యం బాటిళ్లను ఎక్సైజ్ సీఐ జుల్ఫీకర్ అహ్మద్, ఎస్సై శ్రీసాయి ఆధ్వర్యంలో గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట ధ్వంసం చేశారు. వాటి విలువ రూ.2లక్షలు ఉంటుందన్నారు. అక్రమంగా మద్యం అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### ఎలుగుబంట్ల దాడిలో రైతులకు గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రైతు

నెన్నెల: మండలంలోని మైలారం గ్రామ శివారులో గురువారం మూడు ఎలుగుబంట్లు దాడి చేయడంతో దుబ్బపల్లి గ్రామానికి చెందిన అర్క మారయ్య, గావిడి మల్లేశ్ అనే గిరిజన రైతులకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తుల కథనం ప్రకారం.. సదరు రైతులు మధ్యాహ్నం గ్రామ శివారులోని పత్తి చేన్లకు వెళ్తుండగా మూడు ఎలుగుబంట్లు అకస్మాత్తుగా వచ్చి దాడి చేశాయి. తీవ్రగాయాలు కావడంతో బాధిత కుటుంబ సభ్యులు వెంటనే 108లో బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యంకోసం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

### అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య

జైపూర్: మండలంలోని ఇందారం క్రాస్ రోడ్డు సమీపంలో రాజీవ్‌రహదారి పక్కన అటవీప్రాంతంలో మంచిర్యాల పట్టణం హైటెక్‌సిటీ కాలనీకి చెందిన బోయిని శంకర్(35) అలియాస్ రాఘవులు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్ గత ఐదేళ్లగా కడుపు, ఒళ్లునొప్పులతో బాధపడుతున్నాడు. కరీంనగర్ ఆస్పత్రిలో వైద్యం చేయించినా నయం కాలేదు. దీంతో మద్యానికి బానిసయ్యాడు. చేపలు విక్రయిస్తూ జీవించే శంకర్ ఇంట్లో నుంచి వచ్చి రెండు మూడు రోజులు బయట చేపలు విక్రయిస్తూ తిరిగి ఇంటికి వెళ్లేవాడు. ఇదే క్రమంలో గత 23న చేపలు విక్రయించడానికి వెళ్తున్నానని చెప్పి 24న ఇందారం క్రాస్‌రోడ్డు వద్దకు బస్సులో వచ్చి చెట్టుకు ఉరేసుకున్నాడు. తన చావుకు ఎవరూ కారణం కాదని, అనారోగ్య కారణాలతో ఆత్మహత్యకు పాల్పడినట్లుగా సూసైడ్ నోట్ లభించింది. మృతుడి తల్లి బోయిని భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్సై శ్రీధర్ తెలిపారు.

### సింగరేణి కార్మికుడు ఆత్మహత్య



గోవర్ధన్‌రెడ్డి (ఫైల్)

మందమర్రిరూరల్(రామకృష్ణాపూర్): రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జవహర్‌గర్‌కు చెందిన సింగరేణి కార్మికుడు రెక్కల గోవర్ధన్‌రెడ్డి (39) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఆర్కేపీ సీహెచ్‌పీలో జనరల్ అసిస్టెంటుగా పనిచేస్తున్న గోవర్ధన్‌రెడ్డికి అతని భార్యకు మధ్య బుధవారం రాత్రి గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెంది గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని హనుమాన్‌నగర్‌లో చోటు చేసుకుంది. సీఐ కర్రె స్వామి తెలిపిన వివరాల మేరకు కాలనీలో నివాసముంటున్న సామ అశోక్‌రెడ్డి (55)కి భోరజ్ మండలంలోని పెండల్‌వాడలో తనకున్న నాలుగెకరాల్లో ఈ ఏడాది పత్తి సాగు చేశాడు. ఆశించిన పంట దిగుబడి వచ్చేలా కనిపించకపోవడంతో పంట సాగుకు తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలని మనస్తాపం చెందాడు. బుధవారం ఇంట్లో పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.





బతుకమ్మ అనగానే అందరికీ గుర్తొచ్చేవి.. తీరొక్క పువ్వులు.. బతుకమ్మ పాటలు. ప్రస్తుతం పూలకు ఎంత డిమాండ్ ఉందో.. పాటలకు అంతే ఉంది. ఏటా కొత్త కొత్త పాటల కోసం మహిళలు ఎదురు చూస్తుంటారు. అయితే ఒకప్పుడు బతుకమ్మ ఆట, పాటలు సంప్రదాయబద్ధంగా ఉండేవి. మహిళలు లయబద్ధంగా చప్పట్లు కొడుతూ బతుకమ్మల చుట్టూ తిరుగుతూ బతుకు చిత్రాన్ని ఆవిష్కరించే పాటలు పాడేవారు. క్రమంగా ఆ పాటలు కనుమరుగవుతున్నాయి. అయితే ఇప్పటికీ కొందరు పాత పాటలతో ఆకట్టుకుంటున్నారు. ఇక ప్రస్తుత తరం.. జానపద పాటలు, కోలాటాల నృత్యాలతో ఉత్సాహంగా పాలుపంచుకుంటున్నారు. ఎంగిలి పూల బతుకమ్మతో ప్రారంభమైన ఈ వేడుకల్లో పాటలు సద్దుల బతుకమ్మ వరకు ఊరూరా.. వాడవాడలా మార్మోగుతున్నాయి. పూల పండుగలో పాడే పాటల్లో సామాజిక అంశాలు, కుటుంబ బాంధవ్యాలు దాగి ఉన్నాయి. బతుకమ్మ పాటలపై నాటి, నేటి మహిళల అభిప్రాయాలు..

# పాటపాడే అక్కాచెల్లెళ్లు ఉయ్యాలో..



నిర్మల్ జిల్లా కేంద్రంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

### ప్రోత్సహించాలి



నిర్మల్‌ఖిల్లా: పాటలు పాడే వారిని గుర్తించి ప్రోత్సహిస్తేనే బతుకమ్మ సంప్రదాయం నిలుస్తుంది. ప్రభుత్వంతో పాటు సంఘాలు కూడా బతుకమ్మ పాటల పోటీలు నిర్వహిస్తే కొత్తతరానికి ఆసక్తి పెరుగుతుంది. ఇప్పటి తరానికి బతుకమ్మ పాటల్ని సొంతంగా పాడేవారన్న విషయమే తెలియదు.

– పర్కిపండ్ల లక్ష్మి, తాంద్ర, సారంగాపూర్

### పల్లెదనాన్ని ప్రతిబింబించేలా...



నిర్మల్‌ఖిల్లా: బతుకమ్మ పాటలు అంటేనే పల్లె జీవనాన్ని ప్రతిబింబించే విధంగా ఉంటాయి. మన సంస్కృతి, సంప్రదాయం, జీవన విధానం ఉట్టిపడే బతుకమ్మ పాటలు వారసత్వ సంపదగా కాపాడుకుంటూనే భావితరానికి తెలియజెప్పేందుకు ప్రయత్నం చేయాలి. నేటితరం అభిరుచికి అనుగుణంగా పాతకొత్తల మేలు కలయికగా పాటల్ని రూపొందించుకుంటే మంచిది.

– ఎల్.నవ్య, సింగర్, నిర్మల్

### పాటల వెనుక నాటి జ్ఞాపకాలు



నిర్మల్‌ఖిల్లా: మా చిన్నప్పటి నుంచి బతుకమ్మ పాటలు అంటే ప్రాణం. సాయంత్రం వేదికల వద్ద బతుకమ్మల చుట్టూ తిరుగతూ పాటలు పాడటం ఆనందంగా ఉండేది. బీడీ కంపనీలో తోటి వారితో కలిసి సామూహికంగా బతుకమ్మ ఆడుతూ స్వయంగా పాటలు పాడుకునే వాళ్లం. కానీ ఇప్పటి తరం మాత్రం మొబైల్, టీవీ, డీజే పాటలతో బతుకమ్మ ఆడుతున్నారు.

– సంగెం భూదేవి, అనంతపేట, నిర్మల్ రూరల్

### సంస్కృతిని పరిరక్షిస్తూనే...



నిర్మల్‌ఖిల్లా: కాలానుగుణంగా పాటల రూపం మారినా, ఆత్మ మాత్రం అదే. ఈ తరం భాషలో, బీట్‌లో పాడినా బతుకమ్మ స్ఫూర్తి అందుతుంది. కొత్తగా సృజనాత్మకంగా పాటలను వెలుగులోకి తెస్తున్నారు. నవతరం యువతుల అభిరుచికనుగుణంగా పాటలు రూపుదిద్దుకుంటున్నాయి.

– శైలజ, జానపద గాయని, నిర్మల్

### ఏడు దశాబ్దాలకు పైగా..



నాకు 80 సంవత్సరాలు. నా చిన్ననాటి నుంచి ఏడు దశాబ్దాలకు పైగా బతుకమ్మను చూస్తూ వస్తున్నా. ఇప్పటికీ బొడ్డెమ్మ పాటలు కైగట్టి పాడుతా. ఈతరం మహిళలు బతుకమ్మ ప్రాధాన్యతను తెలియజెప్పే విధంగా ఆ పాటలు నేర్చుకోవాలి. వారసత్వ సంపద లాంటి బతుకమ్మ పాటలు కనుమరుగు కాకుండా సంరక్షించుకోవాలి.

– కట్కం రుక్మాబాయి, బోరిగాం, సారంగాపూర్

### బ్రాండెడ్ పేరిట పీడీఎస్ బియ్యం విక్రయం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సునీల్ కుమార్

ఆదిలాబాద్‌టౌన్: బ్రాండెడ్ బియ్యం పేరిట పీడీఎస్ బియ్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ బీ.సునీల్‌కుమార్ తెలిపారు. గురువారం వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్ పట్టణంలోని చిల్కూరి లక్ష్మీనగర్ కాలనీకి చెందిన షేక్ అయూబ్ పట్టణంలోని శివాజీచౌక్‌లో ఆంధ్రా కిరాణషాపు నడుపుతున్నాడన్నారు. బ్రాండెడ్ బియ్యం సంచుల్లో పీడీఎస్ బియ్యం నింపి ప్రజలకు విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి ఆరు క్వింటాళ్ల రాయితీ బియ్యంతో పాటు ఆటోను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే అతనిపై పలు కేసులు నమోదైనట్లు తెలిపారు. నిందితుడి దుకాణాన్ని జప్తు చేసేందుకు ఆదిలాబాద్ ఆర్డీవోకు సిఫార్సు చేసినట్లుగా వెల్లడించారు.

### చినుకుపడితే చిత్తడే



రోడ్డుపై నిలిచిన నీరు

ఖానాపూర్: పట్టణంలోని ప్రధాన రహదారులు చిన్నపాటి చినుకులకే చిత్తడిగా మారుతున్నాయి. ప్రధాన రహదారిపై పలుచోట్ల ఏర్పడ్డ గుంతలతో వాహనదారులతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఆయా చోట్ల మున్సిపల్ ఆధ్వర్యంలో గుంతల్లో మట్టి పోసినప్పటికీ వర్షం కురియడంతో గుంతల్లోని మట్టి కొట్టుకుపోయి యధావిధిగా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా గుంతలను పూడ్చేందుకు శాశ్వత మరమ్మతు పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## లంబాడీలను తొలగించే వరకు ఉద్యమిస్తాం

- తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గోడం గణేశ్




తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

తలమడుగు: ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించే వరకు ఉద్యమిస్తామని తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గోడం గణేశ్ అన్నారు. గురువారం రాయి సెంటర్, 9 ఆదివాసీ తెగలు, తుడుందెబ్బ, ఇతర సంఘాల ఆధ్వర్యంలో వేంకటేశ్వర ఆలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు మహా పాదయాత్ర నిర్వహించారు. కుమురంభీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకు దెరువు కోసం వలస వచ్చి ఆదివాసీలకు రావాల్సిన అభివృద్ధి ఫలాలను రాకుండా చేస్తున్న లంబాడీలను వెంటనే తొలగించాలన్నారు. అక్రమంగా వలస వచ్చిన వారికి ఎస్టీ కులధ్రువీకరణ పత్రాలు జారీ చేయవద్దన్నారు. అనంతరం తహసీల్దార్ రాజమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ మండల అధ్యక్షుడు జంగాల పోచన్న, డివిజన్ అధ్యక్షుడు కుమురజ్ఞానేశ్వర్, రాయి సెంటర్ అధ్యక్షుడు రామారావు, ఉపాధ్యక్షుడు భుజంగరావు పాల్గొన్నారు.

## గిరి గ్రామాల అభివృద్ధే లక్ష్యం

- కేంద్ర పరిశీలకుడు జితేంద్ర సింగ్




జితేంద్రసింగ్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

నేరడిగొండ: గిరిజన గ్రామాల అభివృద్ధే ఆదికర్మ అభియాన్ లక్ష్యమని కేంద్ర ప్రభుత్వ పరిశీలకుడు జితేంద్రసింగ్ అన్నారు. గురువారం మండలంలోని వివిధ గ్రామపంచాయతీల్లో పర్యటించి కార్యక్రమం అమలు తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా లింగట్ల గ్రామ పంచాయతీలోని గోండుగూడలో గుస్సాడీ నృత్యంతో ఆయనకు స్వాగతం పలికారు. లింగట్ల రాజురా, వెంకటపూర్ గ్రామపంచాయతీల్లో కార్యక్రమం అమలు, గ్రామాభివృద్ధి కార్యాచరణ ప్రణాళిక, గ్రామసభ, గ్రామ సోషల్ మ్యాపింగ్, నిరుద్యోగ యువత గుర్తింపు వంటి అంశాలను పరిశీలించి సంతృప్తి చెందారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి వంటి అభివృద్ధి చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. నేరడిగొండ మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లో ఈ కార్యక్రమం అమలవుతుందని ఆయన పేర్కొన్నారు.

## చికిత్స పొందుతూ మహిళ మృతి



వైద్యున్ని నిలదీస్తున్న మృతురాలి బంధువులు

కాగజ్‌నగర్‌టౌన్: అనారోగ్యంతో బాధపడుతూ మూడు రోజులుగా పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని సీతానగర్‌కు చెందిన మౌల్‌కార్ అమృత (40) గురువారం రాత్రి మృతి చెందింది. కాగా వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే మృతి చెందిందని ఆరోపిస్తూ బాధితురాలి కుటుంబ సభ్యులు, బంధువులు వైద్యుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సరైన వైద్యం అందించకపోవడంతోనే ఒక నిండు ప్రాణం బలైందని, దీనికి ఆస్పత్రి యాజమాన్యమే బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో విషయం తెలుసుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకుని బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఓరియంట్ కార్మికులకు బోనస్ పెంపు




అగ్రిమెంట్ పత్రాలతో సత్యపాల్‌రావు

కాసిపేట: దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపనీ పర్మినెంట్, లోడింగ్ కార్మికులకు బోనస్ పెంచుతూ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. గుర్తింపు సంఘం అధ్యక్షుడు సత్యపాల్‌రావుతో యాజమాన్యం గురువారం నిర్వహించిన చర్చల్లో రూ.4 వేలు పెంచేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. గతంలో రూ.35,500 ఉండగా ప్రస్తుతం రూ.39,500కు పెంచారు. రాబోయే సంవత్సరానికి రూ.2వేలు పెంచుతూ రూ 41,500లకు అగ్రిమెంట్ చేసుకున్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు రూ.16,800 ఇస్తుండగా రూ.వెయ్యి పెంచుతూ రూ.17,800 ఇవ్వనున్నట్లు తెలిపారు. చర్చల్లో కంపనీ హెచ్ఆర్ హెడ్ ఆనంద్ కులకర్ణి, గుర్తింపు సంఘం సెక్రటరీ భీమిని మహేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌లు పాల్గొన్నారు.

### కొట్టుకుపోయిన సదర్మాట్ గేటు

ఖానాపూర్: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు అధికారులు ఎస్సారెస్పీ గేట్లు ఎత్తి దిగువన ఉన్న గోదావరికి ప్రతీరోజు 2 లక్షల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. దీంతో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఖానాపూర్ మండలం మేడంపల్లిలోని సదర్మాట్ వద్ద ఒక గేటు బుధవారం రాత్రి వరద నీటిలో కొట్టుకుపోయింది. అప్రమత్తమైన అధికారులు సదర్మాట్‌తో పాటు గోదావరి పరీవాహకంలోని పలుచోట్ల ఎస్కేప్ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. గురువారం గేటు కొట్టుకుపోయిన ప్రాంతాన్ని ఇరిగేషన్ ఈఈ ప్రవీణ్, డీఈ వీరన్న, ఏఈఈ నితిన్ సందర్శించారు. వరద ఉధృతి తగ్గాక గేటు ఏర్పాటు చేస్తామన్నారు. ఖానాపూర్, కడెం మండలాల పరిధిలోని సుమారు 15వేల ఎకరాలకు సాగు నీటిని అందించే సదర్మాట్ కాలువ గేటు పోయిన విషయం తెలియడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### పండుగలకు ప్రత్యేక రైలు

కాగజ్‌నగర్‌టౌన్: దసరా, దీపావళి పండగల దృష్ట్యా ప్రయాణికుల రద్దీ తీవ్రతను దృష్టిలో ఉంచుకున్న దక్షిణ మధ్య రైల్వే అధికారులు హజ్రత్ నిజాముద్దీన్-చర్లపల్లి, చర్లపల్లి-హజ్రత్ నిజాముద్దీన్ మధ్య ప్రత్యేక రైలును నడిపించనున్నట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రైలు చర్లపల్లి నుంచి ప్రతీ మంగళ, గురువారాల్లో, హజ్రత్ నిజాముద్దీన్ నుంచి బుధ, శుక్ర వారాల్లో బయలుదేరుతుందని పేర్కొన్నారు. కాజీపేట్, పెద్దపెల్లి, మంచిర్యాల, సిర్పూర్ కాగజ్‌నగర్, బల్లార్షా, చంద్రాపూర్, సేవాగ్రాం, నాగ్‌పూర్, అమ్లా, ఇటార్సి, బోపాల్, బిన, జాన్సీ, అగ్ర, స్టేషన్లలో నిలిపేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ రైలులో 1 ఏసీ, 2ఏసీ, 3 ఏసీ, స్లీపర్, జనరల్, సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయని, ప్రయాణికులు గమనించాలని సూచించారు.

### న్యాయ నిర్ణేతలుగా ఉమ్మడి జిల్లా రెఫరీలు

ఆసిఫాబాద్: హైదరాబాద్‌లోని నిజాం కళాశాల ఆవరణలో ఈ నెల 26 నుంచి 29 వరకు జరుగనున్న 17వ హెచ్ఎఫ్ఐ మినీ బాలబాలికల హ్యాండ్‌బాల్ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఉమ్మడి జిల్లాకు చెందిన రెఫరీలు సునార్కర్ అరవింద్, దుర్గం రాజలింగు, గోగర్ల రాజశేఖర్, గోగర్ల సాయి ఎంపికైనట్లు అసోసియేషన్ ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గోనె శ్యాంసుందర్ రావు తెలిపారు. దేశంలోని అత్యున్నత క్రీడా శిక్షణ సంస్థ అయిన నేతాజీ సుభాష్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ పటియాలలో ఇప్పటికే శిక్షకులుగా శిక్షణ పూర్తి చేసుకున్నట్లు ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

### 'ఓపెన్' పరీక్షలకు 60 మంది గైర్హాజర్

మంచిర్యాలఅర్బన్: ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షకు గురువారం మొత్తం 295 మందికి గానూ 235 మంది హజరుకాగా 60 మంది గైర్హాజరయ్యారు. స్థానిక జెడ్పీ బాలికల పాఠశాలలో నిర్వహించిన ఇంటర్ పరీక్షకు 143 మందికి గానూ 113 మంది హాజరుకాగా 30 మంది గైర్హాజరయ్యారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పది పరీక్షలకు 97 మందికి గానూ 79 మంది హాజరుకాగా 18 మంది గైర్హాజరయ్యారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఇంటర్ పరీక్షలకు 54 మందికి గానూ 43 మంది, బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పది పరీక్షలకు ఒక్కరే పరీక్ష రాయాల్సి ఉండగా గైర్హాజరయ్యారు.

## ముంబై ఎయిర్‌పోర్టులో ఆదిలాబాద్ వాసి అరెస్ట్



నిందితుడు షేక్ ఇర్ఫాన్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్ రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: టాంజానియా దేశంలో ఉంటూ మత విద్వేషాలను రెచ్చగొట్టేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన ఆదిలాబాద్ పట్టణానికి చెందిన షేక్ ఇర్ఫాన్‌ను ముంబై ఎయిర్‌పోర్టులో అరెస్టు చేసినట్లు డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. గురువారం వన్‌టౌన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్‌రూరల్ పోలీసులు రౌడీషీటర్ కైంచి సలీంను అరెస్ట్ చేసిన ఘటనపై నిందితుడు ఇర్ఫాన్ 'సిల్‌సిలా ఆదిలాబాద్' అనే వాట్సాప్ గ్రూపులో టాంజానియాలో ఉంటూ వివాదాస్పద వాయిస్, టెక్స్ట్ మెసేజ్‌లు పోస్ట్ చేశాడు. దీంతో గత ఏప్రిల్ 15న ఆదిలాబాద్ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నిందితుడు విదేశాల్లో ఉండటంతో ఎస్పీ అఖిల్ మహాజన్ సిఫార్సు మేరకు ఇమిగ్రేషన్ అధికారులు అతనిపై లుక్ అవుట్ సర్క్యులర్ (ఎల్ఓసీ) జారీ చేసినట్లు పేర్కొన్నారు. మంగళవారం టాంజానియా నుంచి ముంబై అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చిన షేక్ ఇర్ఫాన్‌ను ఇమిగ్రేషన్ అధికారులు డిటైన్ చేసి ఎయిర్‌పోర్ట్ పోలీసులకు అప్పగించారు. అనంతరం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్సై పీర్‌సింగ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ముంబైలో అతన్ని పట్టుకొని ఆదిలాబాద్‌కు తరలించినట్లు చెప్పారు. జడ్జి ఎదుట హాజరుపర్చగా 14 రోజుల జుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. నిందితుడి వద్ద నుంచి పాస్‌పోర్ట్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## లైన్‌మెన్‌పై మహిళా కార్యదర్శి ఫిర్యాదు

కోటపల్లి: మండలంలోని దేవులవాడ సబ్‌స్టేషన్ పరిధిలోని లైన్‌మెన్ రామకృష్ణపై ఓ మహిళా కార్యదర్శి ఎస్ఈకి ఫిర్యాదు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని ఓ గ్రామ పంచాయతీ కార్యదర్శి విద్యుత్ పనుల నిమిత్తం ఎల్‌సీ విషయంలో లైన్‌మెన్ రామకృష్ణకు ఫోన్ చేసి మాట్లాడారు. ఆ తర్వాత నుంచి మధ్య మధ్యలో ఫోన్ చేసి అసభ్యకరంగా మాట్లాడుతూ విసిగిస్తున్నాడని కార్యదర్శి పేర్కొన్నారు. ఈ విషయమై ఏఈకి ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ఎస్ఈ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాగా, సదరు లైన్‌మెన్‌కు యూనియన్ బడా నాయకుడితోపాటు ఏఈ అండదండలు ఉండడంతో తనకేం కాదనే ధీమాతో ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో బొప్పారం గ్రామంలో రైతుల నుంచి డబ్బులు డిమాండ్ చేసిన లైన్‌మెన్‌ను సస్పెండ్ చేసి చెన్నూర్ మండలానికి బదిలీ చేశారు. తిరిగి దేవులవాడకు వచ్చినా అతడి ప్రవర్తనలో మార్పు రాలేదని తెలుస్తోంది. ఇటీవల ట్రాన్స్‌ఫార్మర్ల బిగింపులో డబ్బులు తీసుకున్నాడని ఆరోపణల నేపథ్యంలో అధికారులు విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదించారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఫిర్యాదుపై ఏఈ వెంకటేశ్వర్లును సంప్రదించగా.. ఫిర్యాదును ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిపారు.

## డిగ్రీ చేసిన డిపెండెంట్లకు క్లర్క్ పోస్టులు



ఒప్పంద పత్రాలతో గుర్తింపు సంఘం నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణి గని ప్రమాదంలో చనిపోయిన ఉద్యోగుల స్థానంలో డిగ్రీ చదివిన డిపెండెంట్లకు సూటబుల్ జాబ్ కింద గ్రేడ్ 3 క్లర్క్‌పోస్ట్ ఇవ్వడానికి ఒప్పందం జరిగింది. 2009లో అప్పుడున్న గుర్తింపు సంఘం ఏఐటీయూసీకి, యజమాన్యానికి మధ్య జరిగిన చర్చల్లో గని ప్రమాదాల్లో ఉద్యోగులు చనిపోతే వారి పిల్లలకు విద్యార్హతను బట్టి సూటబుల్ జాబ్ కల్పించాలని ఒప్పందం జరిగింది. కానీ కేవలం ఐటీఐ, బీటెక్ వంటి టెక్నికల్ చదువులు చదివిన వారికి ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, టెక్నికల్ సూపర్‌వైజర్లుగా సూటబుల్ జాబ్ కల్పిస్తున్నారు. నాన్ టెక్నికల్ చదువులైన డిగ్రీ మరే ఇతర సత్సమాన డిగ్రీ విద్యార్హత ఉన్న డిపెండెంట్లకు మాత్రం అండర్‌గ్రౌండ్‌లో జనరల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం కల్పిస్తున్నారు. దీనిపై ప్రస్తుత గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు పలుమార్లు యజమాన్యంతో చర్చించారు. స్ట్రక్చరల్ సమావేశంలో కూడా ఈ డిమాండ్‌ను పెట్టారు. దీంతో గురువారం ఈ అంశంపై హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎల్సీ సమక్షంలో యజమాన్యానికి, గుర్తింపు సంఘానికి మధ్య ట్రైపార్టీయేట్ సమావేశం జరిగింది. ఇందులో సమస్యలను పరిష్కరిస్తూ రాత పూర్వక ఒప్పందం జరిగింది. ఉద్యోగి గని ప్రమాదంలో మృతి చెందితే డిగ్రీ అర్హత కలిగిన వారి పిల్లలకు గ్రేడ్ 3 క్లర్క్‌గా ఉద్యోగం కల్పించబోతున్నారని గుర్తింపు సంఘం ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ తెలిపారు. ఇదిలా ఉంటే 2009 నుంచి మైన్స్ యాక్సిడెంట్ కేసుల్లో డిపెండెంట్లు డిగ్రీ అర్హత ఉండి జనరల్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేస్తున్న వారికి కూడా గ్రేడ్ 3 క్లర్క్ ఇప్పిస్తామని తెలిపారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ



వివరాలు సేకరిస్తున్న క్లూస్‌టీం సిబ్బంది

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఏఎన్‌రెడ్డి కాలనీలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. బాధితుల కథనం ప్రకారం సారంగాపూర్ హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రమేష్ చందర్ గౌడ్ ఈనెల 22న కుటుంబ సభ్యులతో కలిసి మహారాష్ట్రలో ఉంటున్న కూతురు ఇంటికి వెళ్లారు. గురువారం తెల్లవారుజామున పనిమనిషి ఇంటికి వచ్చి చూడగా తాళం పగలగొట్టి ఉంది. విషయాన్ని రమేష్ చందర్‌గౌడ్‌కు ఫోన్ ద్వారా చెప్పడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు ఐదున్నర కేజీల వెండి, తులం నర బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు తెలిపారు. క్లూస్‌టీం, ఫింగర్ ప్రింట్ టీం వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.